# పనిమనిషి వల్ల సౌఖ్యం



రాత్రి భోజనాలయ్యాక పడక గదిలోకి వెళ్ళి పడుకున్నాడు రాజారావు. వంటగది లోని సామానులన్నీ సర్ది, భర్త దగ్గరకు వచ్చి పక్కనే కూర్చుంది సుశీల.

"ఏమండీ!" అని మెల్లగా పిలిచింది సుశీల.

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక చదువుకుంటున్న రాజారావు "ఊఁ ఏమిటో చెప్పు!" అన్నాడు ఆమెవైపు లాలనగా చూస్తూ.

"మరేం లేదండీ! ఒకటడుగుతాను కాదనరుగదా!" అంది

"పడకగదిలో పడుచుపెళ్ళాం ఒక్కటికాదు ఎన్నడిగినా ఇస్తాడు ఏ భర్తైనా! ఏంకావాలో చెప్పు. ముద్దులు కావాలా?" అన్నాడు కవ్విస్తూ.

"ఛీపోదు. మీకెప్పుడు అలాంటి ఆలోచనలే. సరసాలు చాలుగాని శ్రద్ధగా వినండి. మనకు పని మనిషి కావాలండీ" అంది గోముగా సుశీల.

పనిమనిషి అనగానే పిడుగుపడినట్లు అదిరిపడ్డాడు రాజారావు.

రాజారావు ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు. క్రమశిక్షణతో ఉద్యోగం చేస్తూ, నిజాయితీపరుడని పేరు తెచ్చుకున్నాడు. బల్ల కింద చేతులుపెట్టి అన్యాయంగా డబ్బు సంపాదించడమంటే అసహ్యం అతనికి. ఉన్నంతలో తృప్తిగా బతుకుతూ నీతిగా నిరాడంబరంగా జీవించాలన్నదే అతని ధ్యేయం.

"ఏమండీ! పనిమనిషి అనగానే అలా బాంబుపేలినట్టు భయపడిపోతున్నారెందుకు?" ఆశ్చర్యపోతూ అడిగింది సుశీల.

"మరేంలేదు మనకు పనిమనిషి ఎందుకని ఆలోచిస్తున్నాను. మనింట్లో ఉన్నది మనిద్దరమే కదా! పిల్లాపీచు ఎవరూలేరు. పైగా ఇంట్లో బావి, నల్లా లాంటి వసతులన్నీ ఉన్నాయి. పనిమనిషి ఇంకెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

"మీకెప్పుడు ఇలాంటి చాదస్తాలే! పక్కింటి మీనాక్షిని ఆమె భర్త రమణారావుగారిని చూడండి. వాళ్ళు ఉండేది ఇద్దరే! ఆయన మీ ఆఫీసులోనే గుమస్తా ఉద్యోగం చేస్తున్నాడు గదా! వాళ్లెంత దర్జాగా పనిమనిషిని పెట్టుకొని బతుకుతున్నారో చూడండి" అంది సుశీల బాధపడుతూ.

"పక్కింటి వాళ్లమాదిరిగా మనం బతకాలని రూలేముంది సుశీలా! రమణారావు రెండు చేతులా సంపాదిస్తున్నాడు. ఆఫీసులో అమ్యామ్యా లేనిదే ఫైలు ముట్టుకోడు. అందరిలో చెడ్డ పేరు తెచ్చుకున్నాడు. అన్యాయంగా సంపాదిస్తూ దర్జాగా బతకడం నాకు గిట్టదు. నీతిగా సంపాదిస్తూ నిరాడంబరంగా, నిజాయితీగా జీవించాలన్నదే నా కోరిక. ఏనా మనింట్లో పనిమనిషి అవసరం ఉన్నట్లు నాకు తోచడం లేదు ఆడవాళ్లు ఇంట్లో ఏమాత్రం పనిచేయకుండా ఉంటే ఆరోగ్యం చెడిపోతుంది" అన్నాడు నచ్చజెప్పే ధోరణిలో.

"చాల్లెండి మీ చేతగాని కబుర్లు మీరూను! 'అందని ద్రాక్షపండ్లు పుల్లన' అన్నట్టుగా ఉంది మీవరస. ఏనా మీరెప్పుడైనా నా మాటను విన్నారా? నా రాతే ఇంత" అంటూ ఏడుపుమొహం పెట్టి ముక్కు చీదింది సుశీల.

ఇక భార్యమాట కాదంటే లాభం లేదనుకున్నాడు రాజారావు. ఐదు పది నిమిషాల్లో ఆమె కళ్లు భారీగా కన్నీళ్లు వర్షించే సూచనలు ఉన్నాయని గ్రహించాడు.

"సరే లేవోయ్! ఇంతదానికే ఏడుపెందుకు? పని మనిషి అంతగా అవసరం లేదన్నాను గాని, నీ మాటను కొట్టిపారెయ్యాలని కాదు. నీ ఇష్టప్రకారమే పనిమనిషిని పెడతాను. అందమైన ఆడవాళ్లు ఏడ్చినా అందంగానే ఉంటారు. కాని నువ్వేడిస్తే నేనోర్చుకోగలనా! ఏడవకు నా బుజ్జి

...వి కదూ! ఇలా రండి దేవిగారూ!" అంటూ బుజ్జగిస్తూ దగ్గరికి లాక్కున్నాడు రాజారావు.

భర్త చిలిపితనానికి నవ్వుతూ తన మాటను ఒప్పుకున్నందుకు సంతోషించింది సుశీల.

"మీరెంత మంచివారో నాకు తెలుసులెండి! అందుకనే మిమ్మల్ని కోరి కోరి పెళ్లి చేసుకున్నాను" అంటూ భర్తను లతలా పెనవేసుకుంది సుశీల.

★ ★ ★

వారం రోజుల తర్వాత ఓ పనిమనిషి రాజారావు ఇంటికి వచ్చింది. వస్తూనే "రాజారావుగారూ! రాజారావుగారూ!?" అంటూ పిలిచింది.

ఏదో ఆఫీసు ఫైలుతో కుస్తీపడుతున్న రాజారావు పిలుపు విని ముందు గదిలోకి వచ్చాడు.

"పనిమనిషి కావాలని చెప్పారట మీరేనా?" అడిగింది పనిమనిషి.

"ఔను నేనే చెప్పాను" అంటూ భార్యను కేకేశాడు రాజారావు.

వంటింట్లో ఉన్న సుశీల భర్త పిలవగానే బయటకొచ్చింది. భర్త దగ్గర నిల్చున్న మనిషిని చూచి 'ఎవరామె' అన్నట్టు ప్రశ్నార్థకంగా చూచింది.

"మనకు పనిమనిషి కావాలన్నావు కదా! మా ఆఫీసులోని అటెండరుకు చెప్పి ఉంచాను. ఈమెను పంపించాడు" అన్నాడు రాజారావు సుశీల వైపు చూస్తూ.

తమ ఇంటికి వచ్చిన పనిమనిషిని నఖశిఖ పర్యంతం పరీక్షించి చూడసాగింది సుశీల.

ఆమెకు ఇరవై ఏళ్లుంటాయి. ఆమె అంగసౌష్టవం చెక్కిన శిల్పంలా ఉంది. మంచి విలువైన అందమైన చీరకట్టుకుంది. దానికి తగినట్లు మ్యాచ్ అయ్యే జాకెట్ వేసుకుంది. మనిషి ఎంతో అందంగా ఆకర్షణీయంగా ఉంది. ఈమె పనిమనిషా లేక సినిమాల్లో వేషాలు వేసే హీరోయినా? అని మనసులోనే అనుకుంది. సుశీల.


రొండికి చేతులు పెట్టుకొని ఎంతో హుందాగా నిల్చొని భర్తవైపు దొంగచూపులు చూస్తున్న పనిమనిషిని "నీ పేరేమిటి?" ఇంటర్వ్యూ చేసే అధికారిలాగా ప్రశ్నించడం ప్రారంభించింది సుశీల.

"నా పేరు ప్రేమలతాదేవిగారండీ!" ఒయ్యారాలు ఒలికిస్తూ చెప్పింది పనిమనిషి.

భర్త ఆమెను క్రీగంట చూస్తున్న విషయం గ్రహించింది సుశీల.

"పెళ్లయిందా?" అడిగింది సుశీల.

"కాలేదండి! మంచి భర్త దొరికితే మనువాడాలనుకుంటున్నాను" అంది పనిమనిషి రాజారావును అదోలా చూస్తూ.



"ఇవ్వాళ కూడా హోంవర్క్ చేసుకురాలేదా? ఏం? ఎందుకని? అడిగాడు మాష్టారు, వంశీని. "ఆ దిక్కుమాలిన హోంవర్క్ చెయ్యడంకన్నా మీతో నాలుగు తన్నులు తిని కూర్చోవడమే మేలనిపించింది సార్!" చెప్పాడు వంశీ.

— చందూ వంశీ
నంద్యాల.

రాజారావు అక్కడ భార్య ఉందన్న మాటే మరిచిపోయి, పనిమనిషి వైపు అదేపనిగా చూస్తూ మైకంలో తేలిపోతున్నాడు. వాళ్లిద్దరి వరస చూడగానే ఒళ్లు మండిపోయింది సుశీలకు.

"ఏమిటే! ప్రశ్నించేది నేనైతే ఆయనవైపు చూస్తావెందుకు ఏమండీ? మీరు కూడా నోరు తెరుచుకొని దాన్నే చూస్తుండిపోయారు. అది రంభా? లేక ఊర్వశా?!" అంది వెటకారంగా సుశీల. భర్త పనిమనిషిని అలా కొరుక్కుతినేలా చూడడం నచ్చలేదు ఆమెకు.

"ఛ, ఛ నేనెందుకు చూస్తున్నానే" అంటూ భూమిలోకి తల దించుకున్నాడు వినయంగా రాజారావు.

"పనులన్నీ చేస్తావా? బట్టలుతుకుతావా?" అడిగింది సుశీల.

"అన్ని పనుల్ని చేస్తానండీ! అందుకే కదా వచ్చింది" కళ్లు టపటపలాడిస్తూ చిలిపిగా నవ్వింది పనిమనిషి.

ఆమె అలా నవ్వుతూంటే మళ్లీ చోద్యంగా ఆమెను చూడసాగాడు రాజారావు.

"నిజాయితీగా బుద్ధిగా పని చేస్తావా?" ప్రశ్నించింది సుశీల.

"మీకెలాంటి అనుమానాలు అక్కరలేదండి, నేనో పనిమనిషిని కాదు. మీ చెల్లెలు లాంటి దాన్ని అని అనుకోండి.బావగారికి మీకు నచ్చేవిధంగా అన్ని పనుల్ని చేస్తానండి! అసలు ఇల్లే నాదనుకొని మీ ఇంటి మనిషిలా ప్రవర్తిస్తానండి" అంది పనిమనిషి చొరవ తీసుకొంటూ.

చెల్లెలులాంటి దాన్ని, బావగారిని, అన్నపదాలు వినగానే సుశీల హడలిపోయింది. ఇది తన భర్తను బుట్టలో వేసుకునే బాపతులా ఉంది అని అనుకుంది సుశీల.

"ఇంటి మనిషిలా పని చేస్తుందట. పైగా మంచి మనిషిలా ఉంది అనుమానామెందుకు? పని చేయడానికి కుదుర్చుకుందాం సుశీలా" అన్నాడు ఉత్సాహంగా రాజారావు పని మనిషిని ప్రేమగా చూస్తూ.

అసలే అనుమానంగా ఉన్న సుశీలకు భర్త మాటలు ఇంకా అనుమానాన్ని పెంచాయి. ఈయనగారు తప్పకుండా దాని వలలో పడుతారనుకొంది. ఆమెలో కోపం తారాస్థాయికి చేరుకుంది.

సరేలెండి! ఇలాంటి దాన్ని మనింట్లో ఉంచుకుంటే ఇల్లు గుల్లవుతుంది. అసలు దానిలో పనిమనిషి లక్షణాలు లేవు. కొంపలార్పే లక్షణాలున్నాయి పని మనిషి అక్కరలేదు వెళ్లు. నీలాంటి వాళ్లు పని మనిషిగా ఉంటే బాగుండదు. సినిమాల్లో హీరోయిన్‌లా నటిస్తే బాగుంటుంది" అంది కోపంగా సుశీల.

పనిమనిషి వినపడీ వినపడనట్లు ఏమేమో గొణుక్కుంటూ రుసరుసలాడుతూ వెళ్లిపోయింది.

"ఏమిటే పనిమనిషి కావాలన్నావు. తీరా వస్తే వెళ్లగొడుతున్నావేమిటి?" అడిగాడు రాజారావు అయోమయంగా.

"వద్దులెండి పనిమనిషి అక్కరలేదు గినిమనిషి అక్కరలేదు. మనింట్లో పని నేను చేసుకోగలను. ఇంకెప్పుడు పని మనిషిని రమ్మనకండి. అసలుకే మోసం వస్తుంది" అంటూ భర్తను అదోలా చూసి వంటింట్లోకి వెళ్లిపోయింది సుశీల.

రాజారావు సంతోషంతో పొంగిపోయాడు తన ప్లాన్ సక్సెస్ అయినందుకు.

అసలు సంగతి ఏమిటంటే...

రాజారావుకు తనింట్లో పని మనిషి ఉండటం ఇష్టం లేదు. భార్య తప్పనిసరిగా కావాలంది కనుక డ్రామా కంపెనీలో పనిచేసే ప్రేమలతను పని మనిషిగా నటించమని చెప్పాడు. ఆమె పనిమినషి వేషంలో వచ్చి కవ్విస్తూ నవ్విస్తూ తనను దొంగచూపులతో చూస్తూ చక్కగా నటించింది. సుశీలకు తనపై అనుమానాన్ని కలిగించి ఆమె చేతనే పనిమనిషి అవసరం లేదని చెప్పించగలిగింది. రాజారావు కోరిక సక్సెస్ చేసింది.

ఈ విషయం సుశీలకు తెలియనే తెలియదు పాపం!!

★